క్లుప్తంగా

26, 27న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

ఇంద్రవెల్లి: ఈనెల 26, 27న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సీజన్‌లో సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న గొరపూర్‌లో, 27న ముత్నూర్ గ్రామంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యునివర్సిటీ శాస్త్రవేత్తలతో రైతులకు సాగు విధానంపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న దినేష్ మటోలియా

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కొనుగోలుదారులు, పట్టణ ప్రాంత వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మటోలియా అన్నారు. ఆదివాకం జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాలలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణానికి వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని, అయితే మున్సిపాలిటీ పరిధిలో సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సులబ్ కాంప్లెక్స్ సైతం ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో సీవోసీ ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, కోశాధికారి మనోహర్, ఉపాధ్యక్షుడు తానాజీ నిక్కం, సంతోష్ అగర్వాల్, అమిత్, కట్ట రాజు, మిలింద్, శ్రవణ్ కుమార్, అజ్మీర చంద్రశేఖర్, సురేశ్ పాద్వాల్, నర్సింగ్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానం


ఆడే గజేందర్‌ను ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని తర్నం గ్రామంలో జూన్ 3న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనాలని తర్నం గ్రామస్తులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇరకరి అడెల్లు, జుల సంతోష్, కుమరి ప్రవీణ్, బత్తుల రాహుల్, జుల అడెల్లు, మక్నూరి నరేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన గడుగు చంద్రకాంత్‌కు తలమడుగు మాల సంక్షేమ సంఘం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. చంద్రకాంత్ గత నెల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయాడు. కాగా బాధిత కుటుంబానికి అండగా మాల సంఘం ఆధ్వర్యంలో అండగా నిలిచారు. ఆదివారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ సంఘ నాయకులతో వెళ్లి రూ.10వేల నగదు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. వారి వెంట నాయకులు గజానన్, పొచ్చన్న, శ్రీనివాస్, ప్రశాంత్, నరేశ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

రాజ్‌గోండ్ ఉద్యోగ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో రాజ్‌గోండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బోథ్ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నైతం జైతు అధ్యక్షతన ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మండాడి శంబు, అధ్యక్షుడిగా తోడశం భూమన్న, ప్రధాన కార్యదర్శిగా మండాడి నాగోరావ్, కోశాధికారిగా పెందూర్ సోనేరావు, సంస్కృతికా కార్యదర్శిగా మాడవి లాల్‌దేవ్, సలహాదారులుగా పంద్రం శంకర్, ఆర్ఎస్ నాగోరావ్, వెంకట్రావు, మహిళ ప్రతినిధులుగా గంగామణి విజయలక్ష్మి, దేవేందర్‌లను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఉద్యోగస్తుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

మురుగు కష్టాలు..!


పూడికతో నిండిన డ్రైయినేజీ

- పెరిగిన రోడ్డు ఎత్తు
- దుకాణాల్లోకి వస్తున్న వర్షపు నీరు
- నూతన డ్రైయినేజీ నిర్మించాలని వేడుకోలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో నూతనంగా డబుల్ రోడ్డు నిర్మించారు. కానీ రెండు వైపులా డ్రైయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షకాలంలో ప్రమాదం పొంచి ఉంది. రూ. 13 కోట్లతో ఆదిలాబాద్ బైపాస్ నుంచి నిర్మల్ బైపాస్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. నూతనంగా నిర్మించిన రోడ్డు దాదాపుగా నాలుగు పీట్ల ఎత్తు పెరిగింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత డ్రైయినేజీ పూడకపోయింది. కొద్ది పాటి వర్షానికే రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల్లో వరద నీరు చేరుతోంది.

వ్యాపారుల ఇబ్బందులు..

రోడ్డుకు ఇరువైపులా పాత డ్రైయినేజీని తొలగించి దాని స్థానంలో కొత్త డ్రైయినేజీ నిర్మించాలి. అలా చేయకపోవడంతో వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత రెండు రోజుల కింద కురిసిన చిన్నపాటి వర్షానికే పలు దుకాణంలోని వర్షం నీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

రోడ్డు నిర్మాణానికే నిధులు మంజూరు..

దాదాపుగా 70 సంవత్సరాల కిత్రం నితర్మించిన పాత రోడ్డును తవ్వి నూతనంగా డబుల్ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంతో నాలుగు ఫీట్ల ఎత్తు పెరిగింది. దీంత రానున్న రోజుల్లో వర్షం నీరుతో ఇబ్బంది తలెత్తే పరిస్థితి నెలకొంది. పాత డ్రైయినేజీ స్థలంలో నూతనంగా డ్రైయినేజీ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. కాని కేవలం రోడ్డు నిర్మాణం కోసం మాత్రమే నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం డ్రైయినేజీ నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన డ్రైయినేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన డ్రైయినేజీ నిర్మించాలి



రోడ్డుకు ఇరువైపుల నూతనంగా డ్రైయినేజీ నిర్మించాలి, వర్షకాలంలో చాల ఇబ్బందులు పడవలిసి వస్తోంది, ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పెరమండ్ల నారాయణ, మాజీ సర్పంచ్, ఇచ్చోడ

నిధులు మంజూరు చేయాలి



మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మాణం కోసం ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి. వ్యాపారులను, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చొరవ చూపాలి.

– మచ్చ వెంకటేశ్, ఇచ్చోడ

ప్రతిపాదనలు పంపాం

మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మాణం కోసం రూ. 3 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కాని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు.

– అరవింద్, ఆర్అండ్‌బీ ఏఈ, ఇచ్చోడ

పల్లె దవాఖానా ప్రారంభమెప్పుడో!?


ప్రారంభానికి సిద్ధంగా పల్లె దవాఖానా

- రెండు నెలల క్రితమే పూర్తయిన భవనం
- మంత్రి పర్యటన రద్దుతో వాయిదా
- పట్టించుకోని అధికారులు

తాంసి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించే విధంగా ప్రభుత్వం గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. పల్లె దవాఖానా సొంత భవనాల నిర్మాణానికి జిల్లాలో ప్రత్యేకంగా నిధులు సైతం మంజూరు చేసింది. పల్లె దవాఖానాలు పూర్తయిన ప్రారంభించక నిరుపయోగంగా మారుతున్నాయి. పల్లె దవాఖానా నిర్మాణం కోసం గతేడాది క్రితం ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు కొద్దిగా ఆలస్యంగా పనులు చేపట్టడంతో ఆలస్యంగా నిర్మాణం పూర్తయింది. భవనం ప్రారంభించకపోవడంతో అరకొర వసతులు మధ్య పాఠశాల గదిలోనే కొనసాగుతోంది. దీంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు.

గత నెల 18న ఏర్పాట్లు..

మండల కేంద్రంలోని పల్లె దవాఖానా నూతన భవనాన్ని గత నెల 18న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. చివరి నిమిషంలో మంత్రి పర్యటన రద్దు కావడంతో పల్లె దవాఖానా భవనాన్ని ప్రారంభాన్ని వాయిదా వేశారు. మంత్రి చేతులమీదుగా భవనాన్ని ప్రారంభిస్తే స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందుతాయని భావించారు. మంత్రి పర్యటన రద్దు కావడం, నెల రోజులు గడిచినప్పటికీ నేటికి భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. మంత్రి భవన ప్రారంభాన్ని వాయిదా వేసిన అధికారులు మళ్లీ భవనాన్ని ప్రారంభించడానికి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె దవాఖానా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

పల్లె దవాఖానా భవనాన్ని త్వరలో ప్రారంభిస్తాం. గత నెల 18న మంత్రి చేతులమీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు చేశాం. మంత్రి రాకపోవడంతో భవన ప్రారంభం అలాగే నిలిపివేశాం.

– మహేందర్, పంచాయతీరాజ్ ఏఈ, తాంసి

వైద్యసేవలు అందిస్తాం

పల్లె దవాఖానాను ప్రారంభిస్తే మెరుగైన వైద్యసేవలను అందేలా చూస్తాం. వర్షాకాలం సీజన్ కాబట్టి త్వరగా భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గదిలో సరైన వసతులు లేక సిబ్బందికి ఇబ్బంది తప్పడం లేదు.

– శ్రావ్యవాణి, మండల వైద్యాధికారి, తాంసి

దాబాలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ


నిషేధిత రంగులను బయట పడేస్తున్న అధికారులు


వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

- నిషేధిత రంగులు స్వాధీనం
- వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: సొనాల మండలంలోని గుట్టపక్కతండా సమీపంలో గల రిషి దాబాలో అన్నంలో బొద్దింక రావడం, నిషేధిత పదార్థాలు, కుళ్లిన ఆహార పదార్థాలు ఉండటంతో 'కుళ్లిన చికెన్ పాడైన గుడ్లు' శీర్షికన ఆదివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ రాజార్షి షా సంబంధిత దాబాకు వెళ్లి తనిఖీ చేయాలని జిల్లా ఆహార భద్రత అధికారి మెట్పల్లి వార్ శ్రీధర్‌తో పాటు సిబ్బంది ఆదేశించారు. ఆదివారం అధికారులు రిషి దాబాను తనిఖీ చేశారు. దాబాలోని ఆహార పదార్థాలు, మాంసాన్ని పరిశీలించారు. వంటల్లో కలిపే నిషేధిత రంగులు ఉండటంతో వాటిని బయట పడేశారు. దాబాలు లభ్యమైన ఆహార పదార్థాలను శాంపిలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. దాబాకు ఫుడ్ లైసెన్స్ లేదని తేల్చారు. యజమాని అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి నోటీసు అందజేశారు. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలన్నారు. దాబాలో కనీస పరిశుభ్రత లేదని గుర్తించారు. మండల పంచాయతీ అధికారి మహేందర్ రెడ్డి రూ. 2000 లో జరిమానా విధించారు. జిల్లా ఆహార భద్రతాధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆహార క్రయవిక్రయాలు నిర్వహించేవారు కచ్చితంగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. లేదంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీలో సొనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జొన్నల లారీ పట్టివేత


గుడిహత్నూర్ వద్ద పట్టుకున్న లారీ

ఇచ్చోడ: మహారాష్ట్ర నుంచి జొన్నలు తరలిస్తున్న లారీని గుడిహత్నూర్ మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి ఇచ్చోడ మార్కెట్ అధికారులు పట్టుకున్నారు. మహారాష్ట్రలో కొనుగోలు చేసిన 300 క్వింటాళ్ల జొన్నలను ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన వ్యాపారి లారీలో తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో పట్టుకున్నారు. గుడిహత్నూర్ తహసీల్దార్.. ఆ జొన్నల లారీకి పంచనామా నిర్వహించారు. ఈవిషయమై ఇచ్చోడ ఇన్‌చార్జి మార్కెట్ అధికారి ఆస్మాను ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్‌ను వివరణ కోరగా పట్టుకున్న జొన్నల లారీని గుడిహత్నూర్ పోలీసులు ఇచ్చోడ మార్కెట్ కార్యాలయానికి తరలించామన్నారు. జొన్నల లారీ విషయంలో మార్కెట్ అధికారులు భిన్నాభిప్రాయాలు తెలపడంతో అనుమానాలకు తావిస్తోంది. కాగా, పట్టుకున్న లారీకి ట్రేడర్ టూ ట్రేడర్ కొనుగోలు పత్రాలు ఉన్నాయని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. పూర్తి విచారణ చేస్తే అసలు వాస్తవాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

ప్రేమ పేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు తనను ప్రేమ పేరుతో మోసం చేశాడని అదే గ్రామానికి చెందిన ఓ యువతి ఆదివారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గత కొంత కాలం నుంచి ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని యువతి పే ర్కొంది. తీరా మరో యువతితో పెళ్లి చేసుకునేందు కు సిద్ధమవుతున్నాడని, యువకుడి ఇంటికి వెళితే బయటకు పంపించారని ఆవేదన వ్యక్తం చేసింది. కాగా బోథ్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడిపై ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

బేల: నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని సిర్సన్న గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో జైనథ్, బేల మండలాల పోలీసులు తనిఖీ చేపట్టారు. విత్తనాలు విక్రయిస్తున్న ఎండీ కుర్షిద్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 5కిలోల విడి విత్తనాలు, 23 నకిలీ విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతడిని విచారించగా.. మహారాష్ట్రకు చెందిన మహమూద్ కొనుగోలు చేసినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాల మాఫీయాను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, జైనథ్, బేల మండలాల పోలీసులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో ఒకరి మృతి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం రాజులమడుగు అటవీ ప్రాంతంలో అడవిపంది దాడి చేసిన ఘటనలో ఆదివాసీ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజులమడుగుకు చెందిన కొడప లక్ష్మణ్ (35) భార్యతో కలిసి ఆదివారం ఉట్నూర్ వారసంతకు వెళ్లి వచ్చే టప్పుడు అటవీప్రాంతంలో తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు పొదల చాటుకు వెళ్లాడు. ఈక్రమంలో ఆయనపై అడవిపంది దాడి చేయగా అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌బీవో రాంకుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

విద్యతోనే ఆదివాసీల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

గుడిహత్నూర్: విద్యతోనే ఆదివాసీల జీవితాలు వెలుగులోకి వస్తాయని ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని మాన్కాపూర్ సమీపంలో ఉన్న ఏకలవ్య ఫౌండేషన్ గిరిజన వనరుల కేంద్రంలో నిర్వహించిన కుమురం భీం స్టడీ సర్కిల్ రజతోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలకు ఉన్న విద్యనందించాలనే ఉద్దేశంతో కుమురం భీం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనలు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. ఇక్కడ చదివిన ఆదివాసీ బిడ్డలు ఈరోజు ఉద్యోగాలు సాధించి తమ జీవితాలకు వెలుగులు అద్దడం సామాన్య విషయం కాదన్నారు. వేణుగోపాల్ రెడ్డి చేస్తున్న కృషికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ఏకలవ్య ఫౌండేషన్ సభ్యులు, కుమరం భీం స్టడీ సర్కిల్ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బాటలో పయనించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్

ఆదిలాబాద్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక బాటలో పయనించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ మురళి కృష్ణ ధ్యాన మందిరంలో ఆదివారం నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాధువుల బోధనలను అనుసరించడం ద్వారా ఆధ్యాత్మికత అలవడుతుందన్నారు. నిత్యం భక్తిమార్గంలో పయనిస్తే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందన్నారు. యువత చెడు అలవాట్లను వదిలి సన్మార్గంలో పయనించాలన్నారు. అదే విధంగా ప్రతిఒక్కరూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం సంత్ జ్ఞానేశ్వర్ మహారాజ్ తెలుగు హరి పాట పుస్తకం 5వ ముద్రణను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ్ గురుజీ, ఎనగంటి రాజమౌళి, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన ఎమ్మెల్యే


వీక్షిస్తున్న ఎమ్మెల్యే శంకర్

బేల: మండల కేంద్రంలోని మండల బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి బోనిగిరివార్ గణేష్ ఇంట్లో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మండల నాయకులతో కలిసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వీక్షించారు. మన్ కీ బాత్‌లో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ప్రతీ భారతీయుడి రక్తం మరుగుతుందని, ఘటనపై దేశమంతా ఎంతో బాధపడుతుందని, 140 కోట్ల మంది భారతీయులే మన బలమని ప్రధానిమోదీ తెలిపారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు బొడకుంటి రాకేష్, అశోక్‌రెడ్డి, ప్రభాకర్, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.


ఇచ్చోడ పాఠశాల విద్యార్థులు


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


పాల్గొన్న తాంసి పాఠశాల పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్, ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల 1999–2000 బ్యాచ్, నేరడిగొండ మండలంలోని కుమారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–10 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకొని, యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

– తాంసి/ఇచ్చోడ/నేరడిగొండ

పూల స్వాగతం



భీంపూర్: నిపాని గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు రంగురంగు పూలతో స్వాగతం పలుకుతుంది. అంతే కాకుండా పచ్చని గడ్డి కనువిందు చేస్తుంది. ఆహ్లాదకర వాతావరణంతో ఆకట్టుకుంటుంది.